# చీకటి తప్పు

ఆప్త మిత్రుడి పెళ్ళి కని ఆ ఊరెళ్ళాడు సూర్యం. పెళ్ళి సలక్షణంగా జరిగింది గాని సూర్యం కళ్ళారా ఆ ముహూర్తాన్ని చూడ లేక పోయాడు. సరిగ్గా అదే సమయానికి అతను కళ్ళు పొడుచు కున్నా కనిపించని చీకటిలో ఒక విచిత్ర మైన మహత్తర మైన రసవత్తర మైన అనుభవాన్ని పొందుతూ ఉండి పోయాడు. జన్మకు మరిచి పోలేని ఆ అనుభవం ఎలా కలిగిందంటే...

ఆ మిత్రుడు తనకు చాలా దగ్గరి వాడు. ఊరికే పెళ్ళికి హాజ రయితే చాలదు. అతనితో కులాసాగా గడపాలి. మిగతా మిత్రులతో కూడా తమాషాగా పల్లెటూరి వాతావరణంలో చక్కర్లు కొట్టాలి.

అవును ఆ ఉద్దేశ్యం తోనే రెండు రోజులు ముందు గానే పెళ్ళికి వచ్చేశాడు సూర్యం.

పెళ్ళి కొడుకును పరామర్శించడం... ఇతర మిత్రులతో జల్సాగా కబుర్లు చెప్పడం... ఈ తంతు అంతా జరుగు తుండగానే పెళ్ళింటి పందిరి కింద నవ మోహిని లాంటి కన్నెపిల్ల సాక్షాత్కరించి అతని కళ్ళలో పుప్పొడి కలల దుమారాన్ని రేపేసింది.

ముద్దుగా బొద్దుగా ఉందా అమ్మాయి. నడుస్తుంటే పూల పడవ తేలు తున్నట్టు అనిపించింది.

పెద్ద పెద్ద కళ్ళలో బేల తనం వదల్లేదు గాని పైటను తోసు కొని దూసు కొస్తున్న యౌవన భారాల్లో మాత్రం జాణ తనం దాగలేదు.

సూర్యాని కింకా పాతిక నిండ లేదు. టౌన్‌లో అనుకోని పరిస్థితిలో రెండు సార్లు ఆడ గాలి బాగా తమకంగా తగిలింది కాని అవి గాభరాగా భయంగా ఆత్రంగా మిగిలిన అనుభవాలు.

ప్రేమ, ప్రణయం, శృంగారం కలల్లో కౌగిలిస్తు న్నంతగా నిజ జీవితంలో పరిమళించ లేదు. పందిరి కింద మెరిసి మాయ మైన అమ్మాయిని చూపులతో

కట్టేయా లనుకున్నాడు సూర్యం.

సాధ్య పడ లేదు. మెరుపంటే మెరుపు. తీగ అంటే తీగ. వెను దిరిగి పోతుండగా మెలికలు తిరిగిన ఆమె నడుము సూర్యం మనసులో బంగారు తీగ లాగ మెలిక పడింది.

ఒకసారి, రెండుసార్లు ఆ అమ్మాయి కళ్ళ బడిన ప్రతి సారీ చూపులతో వెంటాడాడు సూర్యం.

పందిరి తర్వాత...విడిదింటి దగ్గర, వంటల దగ్గర, తోరణాలు కడుతున్న దగ్గర క్షణంలో సగంలో ఆమె కనిపించడం...మాయ మవడం! మైకం కమ్మినట్టు ఆమెను చూడ్డం మినహా మరేమీ తోచ లేదు సూర్యానికి.

పెళ్ళి కొడుకు నడిగి లేదా ఇతర మిత్రులతో మాట కదిపి ఆమెను గురించి ఆరా తీద్దా మంటే ధైర్యం చాల్లేదు. పోనీ ఆమెనే పలకరిద్దా మనుకుంటే ఆ సందర్భం లేదు, అంత సాహసం కూడా అనూహ్యమే.

వచ్చిన రోజే ఆమె కంటపడింది.

రెండు రాత్రులు సూర్యానికి నిద్ర పూర్తిగా చెడింది. మూడో రోజుకు దిగు లేసింది.

రాత్రికే పెళ్లి. అర్ధరాత్రి దాటాక ముహూర్తం. తెల్లవారు జామున ట్రెయిన్ కిక తిరుగు ప్రయాణం. అంతే! పెళ్ళి తంతు అంతా జరిగి పోయాక ఎంత మిత్రుడైనా పెళ్ళి ఇంట అతిథిగా ఉంటే మర్యాద ఉన్నా మన్నన మాత్రం ఉండదు.

ముహూర్తం దగ్గర పడుతుండగా వాతావరణ మంతా హుషా రెక్కు తుండగా సూర్యానికి మాత్రం మనసు అథః పాతాళానికి క్రుంగి పోతోంది.

బంతి భోజనాలు జరుగు తుండగా దూరాన మట్టి గోడ దగ్గర ఆమె ఏవో పళ్ళూ ఫలహారాల పళ్ళెం తీసు కెళ్తుండగా అతని కళ్ళలో కోటి మెరుపులు మెరిశాయి. ఆమె లోపలికి వెళ్ళాక మరో నిమిషానికే తిరి గొచ్చింది. గోడ వారన వెళ్తూ కాస్త నెమ్మదిగా నడుస్తూ ఒక చోట ఆగి భోజనాలు జరుగుతున్న పందిరి వైపు చూసింది.

ఆమె కళ్ళు ఎవరి కోసమో వెతుకు తున్నట్టు అనుమానించాడు సూర్యం.

ఎవరూ గమనించని రీతిలో ఆమె కళ్ళు తన మీద ఆగినట్టు ఆమె చిన్నగా తలూపినట్టు అనిపించింది. క్షణంలో ఆమె మాయమైంది.

ఆ తర్వాత సూర్యానికి భోజనం సయించ లేదు. ఆమె నిజంగా తనని

చూసి ఏదో సైగ చేసిందా? లేదా? అనేది నిర్ధారించుకో లేక పోయాడు.

ఏదో ఆశ, ఏదో ఆవేశం అతని మనసుని స్థిమితంగా ఉండ నివ్వ లేదు.

సిగరెట్లు కాల్చుకుంటూ మిత్రు లంతా షికారు బయలు దేరారు గాని సూర్యం వాళ్ళతో వెళ్ళ కుండా ఏదో సాకు చెప్పి విడిదింటి వైపు నడిచాడు.

అతనలా నాలు గడుగులు వేసే లోపే పరిమళపు కెరటం ఒరుసు కుంటూ వెళ్ళి నట్టు...అతని స్వప్న సుందరి హఠాత్తుగా ఎక్కణ్ణుంచో ప్రత్యక్షమై పూల తేరులా అతన్ని దాటి వెళ్తూ...

"దిక్కులు చూడకుండా వచ్చెయ్యి" అని స్పష్టంగా చెప్పడంతో అతనికి మతి పోయింది.

వణుకు తున్న కాళ్ళని కంట్రోల్ చేసు కుంటూ అతను ఆమె వెళ్తున్న వైపు నడిచాడు.

చిన్న పల్లెటూ రది. జన సంచారం మామూలుగా ఉంది. నిర్జనంగా లేదు. కాని టౌన్‌లో లాగా లైట్లు దేదీప్యమానంగా లేవు.

బారెడు దూరంలో ఆమె వెళ్తుండగా మంత్రం వేసినట్టు వెనకే వెళ్ళా డతను.

మెదడులో నిశ్శబ్దంగా బాంబులు పేలుతున్నట్టు అనిపిస్తున్నా విశ్వ ప్రయత్నం మీద గుండెను దిటవు చేసుకుంటున్నా డతను.

కంట బడిన దగ్గర్నుంచి అతను ఆమెను చూపులతో వెంటాడాడు. వేటాడాడు. కాని ఆమె మాత్రం అతని వైపు కన్నెత్తి అయినా చూసినట్టు కనిపించ లేదు, అనిపించ లేదు.

హఠాత్తుగా ఇలా దగ్గరై వెంట రమ్మం దంటే ఏమని అర్థం? కొంప దీసి ఇలా నమ్మించి తీసుకెళ్ళి ఏ మొండి గోడల మధ్యనో...నలుగురు రౌడీల చేత తన్నించదు కదా!

రౌడీలే ఎందుకు? చూపులతో అల్లరి పెట్టి నందుకు ఆమె కుటుంబ సభ్యు లెవరైనా గాని తనని గట్టిగా ఓ చూపు చూడ వచ్చు.

గుట్టు చప్పుడు కాకుండా వెనక్కి తిరిగి వెళ్ళి పోదా మని కూడా అనిపించింది గాని జన్మకో అనుభవం...ఏం చేస్తుందో చూద్దామని ముందుకే వెళ్ళాడు.

అతన్ని దారి తప్పనివ్వ కుండా చాలా జాగ్రత్తగా తీసుకెళ్ళింది ఆమె.

వీధి మలుపుల దగ్గర ఆగింది. సందు మొదట్లో నిదానంగా నడిచింది. చివర్న పెంకుటింటి ముందు మాత్రం ఆగకుండా సరాసరి వెళ్ళి తలుపు తోసుకుని లోపలికి వెళ్ళి పోయింది.

తిరిగి చూడ కుండా రమ్మన్న ఆమె హుకుం గుర్తు చేసు కుంటూ గుబగుబ లాడే గుండెని అదుపులో ఉంచు కుంటూ అతను తలొంచుకుని ఆ ఇంట్లోకి వెళ్ళాడు. బైటకి ఒకే ఇల్లులా ఉంది గాని లోపల పెద్ద ఆవరణలో నాలుగైదు వాటా లున్నాయి.

ఎందుకో గాని లోగిలిలో ఎవరూ లేరు. ఒక మూలన గుడ్డి ముసలవ్వ మాత్రం మెదిలింది. ఎవరు వచ్చినా ఆమె పలకరించేట్టు కూడా లేదు.

ముందు కెళ్ళిన సుందరి ఒక వాటా తలుపు తాళం తీసి లోపలికి వెళ్ళి లైటు వేసింది. కరెంటు దీప మైనా చాలా గుడ్డిగా వెలుగు తోంది.

ఇంట్లో ఎవరూ లేక పోయే సరికి అతనికి భయం హఠాత్తుగా తగ్గి పోయి చెప్ప లేని ధైర్యం వచ్చేసింది. అయితే మరు క్షణం లోనే...జరగ బోయే అనుభవాన్ని తలుచుకుని కొంచెం ఒళ్ళు వెచ్చ బడింది.

ఆమె లోపల్నుంచి ఓ గ్లాసు తీసుకొచ్చి అతని చేతికిచ్చి "తాగెయ్యి" అనడంతో ఏమిటని కూడా అడక్కుండా తాగేశాడు.

వేడిగా లేవు గాని అవి...పాలే!

రెండు రోజుల కలల బరువు ఒక్క సారిగా తీరి అనుకోని అనుభవం ఎదురవు తుండగా అతను తత్తర పడ్డాడు. మాటలకి తడుము కున్నాడు.

అదే సమయంలో...ఆమె మాత్రం తొణుకూ బెణుకూ లేకుండా నిబ్బరంగా ఉండడం చూసి అతను ఆశ్చర్య పడ్డాడు.

ఇటువంటి సందర్భాలలో...ఇష్ట మనేది ఏర్పడ్డ ఆడ దానికి మగాడి కన్న స్థిమితం చాలా ఎక్కువ అనుకున్నాడు. బేల కళ్ళతో ముగ్ధ మనోహరంగా ఉన్న ఈ పరువాల పంట లాంటి అమ్మాయి ఏకాంత వేళలో ఆరితేరిన జాణ కాబో లనుకుంటూ ఉండగానే...

ఆమె కళ్ళు చిట్లించి నవ్వుతూ...

"ఎవ్వరూ రారిటు...ఏం భయం లేదులే! పెళ్ళి కదా...ఎవరిపనుల్లో వాళ్ళు ఉంటారు ... నువ్వు...దా...మరి...." అంటూ లోపలికి నడిపించింది.

వెంట నడుస్తుండగా ఆమె ధైర్య మేమిటో అర్థమైంది సూర్యానికి. పెళ్ళి సందర్భం కాబట్టి బంధు మిత్రుల రాక పోకలు ఉంటాయి. ఆమె వెంట తను

రావడం ఎవరైనా చూసినా బహుశా బంధు మిత్రుల్లో ఒకరని అనుకుంటారు.

ఇంట్లో వాళ్ళందరూ పెళ్ళి లోనే ఉంటారు. కొద్ది సేపట్లో ముహూర్తం! ఎవరూ ఇప్పట్లో రారు! ఆరి తేరిన జాణ కాకుంటే ఎంత ఎత్తు వేసింది!

అపాయం లేకుండా అద్భుతంగా అంతా అమరి నందుకు సంతోషిస్తుండగా ఆమె అతన్ని ఒక గదిలోకి పంపి...కొద్ది క్షణాల్లో తనూ లోపలికి వచ్చి నవ్వుతూ తలుపు గడియ వేసేసింది.

చిమ్మ చీకటి !

లైటు వేస్తుం దేమో నని అతను చూస్తున్నాడు గాని గాజుల చేత్తో ఆమె అతన్ని చెయ్యి పట్టి లోపలికి తీసు కెళ్ళిందే గాని లైటు వెయ్య లేదు.

ఆమె స్పర్శతో ఒళ్ళంతా స్వర్గంలో తేలి పోయింది.

"లైటు" అని అతను తడుము కుంటూ ఉండగా...

"జాగ్రత్త! ఆగు...చెప్పినట్టు విను...లైటు వెయ్యకు. ఇది ధాన్యం గది. అటూ ఇటూ వెళ్తే బస్తాలు దొర్లి మీద పడి పోతాయి...జాగ్రత్త" అంది ఆమె ఆజ్ఞలు జారీ చేస్తున్న స్వరంతో.

"మరి...ఎలా...ఏమీ తెలీదు..." అంటూనే చీకట్లో తడుముకున్నాడు సూర్యం.

ఒక్కసారిగా ఆమెను తనివి తీరా కౌగిలించుకుని ఆ తర్వాత శరీరానికి స్వాతంత్ర్యం ఇచ్చేస్తే సరిపోతుం దనుకున్నాడు గాని అదే క్షణంలో ఆమె అతని చెయ్యి వదిలేసింది.

ఎందుకో హఠాత్తుగా భయమని పించింది. చీకట్లో ఎవరైనా దాక్కున్నారా? తను ఆ అమ్మాయి పట్ల అనుచితంగా ప్రవర్తించి నందుకు ప్రతీకారం జరగ బోతోందా! కొడతారా? చంపేస్తారా?

"ఇప్పుడే అసలు తమాషా! కదిలినా మెదిలినా నేను చెప్పినట్టు వినాలి. నన్ను పట్టుకోవాలని ప్రయత్నించావో...కుదరదు...బస్తాలూ డబ్బాలూ వస్తువులూ అన్నీ తగుల్తాయి నీకు...నువ్వు నన్నిక తాకలేవు...నేను తాక నివ్వను...అల్లరి చేశావో...అరుస్తాను...వెనకింట్లో మనుషులకి వినిపిస్తుంది. వాళ్ళొచ్చి నిన్ను చంపేస్తారు! నిజంగా నువ్వు చెప్పినట్టు వినకుంటే...అంత పనీ చేస్తాను...కాబట్టి...చెప్పినట్టే విను...ముందు...ఎడం వైపు సరిగ్గా నాలు గడుగులు వెళ్ళు....కుర్చీ తగులుతుంది...అందులో కూచో..." అని అన్నదామె.

చిమ్మ చీకట్లో తడుము కుంటూ అడుగులు వేశాడు. కుర్చీ తగిలింది.

చెక్క కుర్చీ. కూచున్నాడు.

స్థిమిత పడ్డ గుండె మళ్ళీ కట్టు తప్పి కొట్టు కుంటోంది. ఏం కుట్ర చేస్తోంది ఆమె? తను చూపులతో అల్లరి చేసి నందుకు ఇదో శిక్షా?

చీకటిలో చిరు మువ్వల సవ్వడిలా ఆమె నవ్వు ఎంతో సున్నితంగా మనోహరంగా వినిపించింది. అతనికి మళ్ళీ ధైర్యం వచ్చింది.

లైటు వేస్తే బైట వాళ్ళకి తెలియ వచ్చు కాబట్టి ఇలా కథ నడిపిస్తోం దనుకున్నాడు.

గదిలో అసలు గాలి ఆడటం లేదు.

ముక్క వాసన. ధాన్యం వాసన. చీకటి చీకటే. కిటికీ లేదు. వెంటిలేటర్ లేదు. మట్టి గోడలు కాబోలు. చెమ్మగిల్లిన వాసన. పేడ వాసన కూడా.

చిన్నగా సన్నగా ఎలుకలు కదులుతున్న సవ్వడి. మధ్యలో ఆమె జడ నుంచి కాబోలు సుతి మెత్తటి సన్నజాజుల పరిమళం. ఆమె చేరువ లోనే ఉండడం వల్ల చీకటి కూడా మత్తెక్కినట్టు బరువైన గాలి మగత లాగా కమ్ముతోంది.

అతనికి భయమూ పిరికి తనమూ పోయి మగ వాడి ననే అహంకారం, తెగువ తన్ను కొచ్చాయి.

"చూడూ! ఈ నాటకం ఎందుకూ! నువ్వు రమ్మంటేనే కదా వచ్చాను! నిన్ను ఇబ్బంది పెడితే...సారీ...క్షమించు. కాని...నువ్వు చాలా బాగున్నావు. తెలుసా!...వెరీ...బ్యూటిఫుల్..." అన్నాడు సూర్యం.

"ఆహా! అందంగా ఉన్నవా ళ్ళందర్నీ అలా చూసెయ్యడ మేనా? భలే చూస్తావే! నిజం చెప్పు...నీకు ఆడదంటే...తెల్సు కదూ...." చీకట్లో ఆమె గొంతు అదోలా వింతగా ఉంది.

కళ్ళకు గంతలు కట్టి ఎవరో ధర్మదేవత ప్రశ్నలు వేస్తున్నట్టు అనిపించింది.

"తెలుసు...అంటే...ఒకసారి...ఒకమ్మాయి..." అంటూనే ఆగి విన్నాడు.

చీకట్లో ఆమె నడక. పట్టుచీర అంచు గరగర. గాజుల సవ్వడి. కదిలింది. నిజమే. గది నిండా బస్తాలు ఉన్న ట్టున్నాయి.మురిగి పోయి నట్టు ధాన్యం వాసన చాలా దగ్గర్నుంచి వస్తోంది. ఆమె చాలా జాగ్రత్తగా నడుస్తున్న సవ్వడి...కనిపెట్టాడు.

దగ్గరగా వచ్చింది. అడుగు తిరిగిన విసురుకి జడ అతని ముఖాన్ని తాకింది.

చీకటికే కోరిక వచ్చింది.

చెయ్యి సాచాడు. ఏమీ తగ లేదు.

ఏదో చెక్క కిరకిర మంది.

"నేను కూచుం టున్నాలే మంచం మీద. నువ్వు తిన్నగా లేచి ఇటు వస్తావా! కుడి చేత్తో గోడను తడుము కుంటూ సరిగ్గా ఆరడుగులు రావచ్చు."

ఆమె చెప్పినట్టు చేస్తుండగా ఏదో సొరంగ మార్గంలో వెళ్తున్నట్టు అనిపించింది.

"ఆగు" చాలా దగ్గర్నుంచి వినిపించింది.

మంచం కిరకిర. గాజుల సవ్వడి.

"మంచం మీదున్నాను కదా అని నువ్వు మీద పడి పోయావో...ఇక్కడ కొడవలి ఎక్కడుందో...నిన్ను నెత్తిమీద కొట్టడానికి ఏవేవి అందుబాటులో ఉన్నాయో నాకు బాగా తెలుసు..."

అతని నరనరం మెలి తిరిగి పోతోంది. ఆవేశం దూకుతోంది. పందిరి కింద మెరిసిన మెరుపు తీగ మెదడులో నృత్యం చేస్తోంది.

పోనీ...కొట్టనీ. అరవనీ. చంపనీ. ఇంత అద్భుతమైన అందాన్ని పొందాక ఏమై పోతేనేం?

కేవలం బెదిరించి టెస్ట్ చేస్తోం దేమో!

ఆమె అరిచి గోల చేసి నలుగుర్నీ పోగు చేస్తే ఆమె పరువు మాత్రం పోదా?

పెళ్ళి కొచ్చిన కుర్రా డెవరో ఆమెకు తెలియ కుండా వెంట వచ్చా డంటే అందరూ నమ్మేస్తారా?

"అబ్బాయ్! నువ్వు చాలా మంచి వాడివి. నాకు నచ్చావులే. కానీ నన్ను తాకొద్దు ఇప్పుడు. తాకితే నీ మీద ఇష్టం పోతుంది. చచ్చేంత ఇష్టం నీ మీద. పిచ్చి ఇష్టం. నా సర్వస్వం నీకే దోచిపెట్టా లనిపిం చేంత ఇష్టం..." చీకట్లో ఆమె గొంతు అమృత వీణలా మధురంగా మోగుతోంది.

"మరి...మరి...ఎందుకిలా...?" తమకంతో చెయ్యి సాచ బోతూ ఆగాడు అతను. ఆమె ఆదేశాన్ని కా దనేంత సాహసం లేదు.

దేవతా మూర్తిలా ఉంది. అతిలోక సౌందర్యం.

ఆమె కాదనే పని ఎందుకు చెయ్యాలి?

"చూడూ...అంటే చూడ లేవులే! నేను అందమైన దాన్ని కదూ? నువ్వు పెళ్ళి పందిట్లో కళ్ళప్పగించి చూశావు కదా! ఇప్పుడు ఏం చూస్తున్నావూ! నన్ను

చూడ్డం లేదు కదా! అయినా నా పక్కన పడుకోవా లనుకుంటావు. వెల్తురులో చూసిన అందాన్నే గుర్తు చేసు కుంటావు. చీకట్లో చూడలే కున్నా మనసు లోని బొమ్మనే అనుభవిస్తావు. ఒక్క విషయం ఆలోచించు. నువ్వు గుడ్డివాడి వైతే... నన్ను ఇష్ట పడ గలవా?"

ఎన్నాళ్ళుగా అలా ఆలోచి స్తోందో! సులభంగా వేసేస్తోంది పెద్ద పెద్ద ప్రశ్నలు.

అతనికి మాట రాదు. చెయ్యి ఆడదు.

మంచాన్ని ఆనుకుని నిలుచున్నాడు.

ఆమె కలలో గొంతుతో మాట్లాడు తోంది.

"చెయ్యి చాస్తే అందుతాను. కావలిస్తే ఇద్దరూ ఒకటి కావచ్చు. ఆడ మగ...అంతే కదా! మనమే మొదటి వాళ్ళం కాము. మనమే చివరి వాళ్ళం కాము. అందరి లాగే మనం. చీకట్లో ఎవరు చేసినా అదే పని..." సాగదీస్తూ మెత్తటి నవ్వు.

సూర్యం మనసులో అప్పుడే మెదిలిన అనుమానాలకి ఆమె వెంటనే సమాధానం చెప్పింది.

"ఇప్పుడే పెళ్ళి చేసుకోనులే నేను...నీకు...నిజం చెప్పనా! నేను ...కన్నెపిల్లని కాను... ఇక్కడే ఈ ధాన్యం బస్తాల మధ్యే ఒకబ్బాయితో...జరిగి పోయింది"

షాక్ మీద షాక్ తగుల్తోంది అతనికి.

"ఏం తప్పు? కుంతీదేవి కూడా ముచ్చట పడింది. కర్ణుడు పుట్టడంతో సమస్య అయింది కథ అయింది గానీ లేకుంటే ఆ అనుభవం పెద్ద విశేషమని ఆమె గుర్తు పెట్టుకునేదా? మళ్ళీ...ద్రౌపదీ దేవి....ఆరో భర్తగా కర్ణుణ్ణి పొందా లనుకుం దట... మోజులన్నీ మనిషి మీదే..." ఏదో చెప్తోందామె.

"నేను...వెళ్ళి పోతాను" అన్నాడు సూర్యం ఇంకేం చెయ్యాలో పాలు పోక.

"అప్పుడేనా? ఇదిగో...చెయ్యి పట్టు చెప్తా" చెయ్యి ముందుకు సాచి గాలిలో తడిమాడు. మెత్తగా తగిలింది. అందుకున్నాడు. ఏదో బట్ట.

"నా జాకెట్...ఏయ్...గట్టిగా నలిపెయ్యకు...."

సూర్యం ఒళ్ళంతా వెచ్చటి తిమ్మిరి పాకింది. కాళ్ళలో శక్తి లేనట్టు మంచం మీద కూచున్నాడు. కిరకిర శబ్దం చేస్తూ ఆమె కదిలి లేచిన శబ్దం.

"చెప్తే వినవు కదూ...ఇదిగో..." అంటూ బట్టల శబ్దం. చీర అంచు రెపరెప. "ఇది చీర...బ్రాసరీ...ఇదిగో...లంగా కూడా..." ఒకటొకటి అతని మీద పడ్డాయి.

తమకంతో అందుకుంటూ తడిమి చూశాడు. మెత్తటి ఆడ వాసన కలిసిన బట్టల స్పర్శతో శరీరం స్వర్గ నరకాల మధ్య ఊగిస లాడటం మొదలెట్టింది.

ఆమె ఏం చేస్తోంది?

నెమలి పింఛంతో విసిరి నట్టు ముఖాన పరిమళాల తుపాను కొట్టి నట్టు ఒక్క విసురుతో దూర మైపోయింది.

"ఓయ్ గంధర్వ కుమారా! నిన్ను కేవలం ఉడికించడానికి కాదు. ఇదొక విచిత్రం కదూ! నీకు చేయి అందుబాటులో నేను నగ్నంగా సహజ శిల్పంలా! నన్ను పొందేంత చేరువలో నువ్వు...అపర మన్మథుడి లాగ...అయినా మన మధ్య ఒక చీకటి అగాథ మంత దూరం...ఈ దూరం...ఇలాగే ఉండడం ఇష్టం నాకు...ప్రేమించి విడిపోయే వాళ్ళ మధ్య దూరం ఇలాగే ఉంటుంది. ఎంతో దగ్గరగా ఉంటుంది. కదూ...?"

ఆమె నవ్వుల్ని అదిమేస్తూ దూరం నుంచి మంగళ వాద్యాల మోత జోరుగా వినిపించింది. ఎడతెగని హోరులా మోగుతున్నాయి వాద్యాలు.

"అదిగో... పెళ్ళయి పోతోంది...మన వాళ్ళ పెళ్ళే...ఇవాళ పెళ్ళి...రేపు శోభనం... మూడో నాటికి అంతా మామూలే! పిల్లలూ సంసారం ఆరోగ్యం అనారోగ్యం...కాని నీ లాగా నా లాగా కొన్ని మధురమైన క్షణాలు...అందీ అందని కోరికతో...పొందీ పొందని అందంతో ఎవరైనా ఎప్పుడైనా పొంద గలరా?..."

ఆమె మాటల్లో మత్తు, మనసారా ఇష్ట పడే తత్వం, ఆర్ద్రత...ముగ్ధ డవుతున్నాడు సూర్యం. కళ్ళు తెరిచి వెనక్కి వాలు తుండగా...కళ్ళ నిండా చీకటి కూరుకు పోతున్నట్టు... చీకటి నిండా ఆమె రూపం ఒక్క పెద్ద వెలుతురుగా హఠాత్తుగా వెలిగినట్టూ....

"నువ్వు మంచబ్బాయివి కదూ? ఒక్క విషయం గుర్తుంచుకో! శాంతిని పాడు చేసేది ఏదైనా తప్పే! చాలా మంది తప్పు చెయ్యడానికి అవకాశాలు వస్తే బాగుండు నని చూస్తుంటారు. కొంతమంది అవకాశం వస్తే చాలు...ఒక పనై పోతుందిగా అన్నట్టు తప్పు చేసేస్తారు...చాలా కొంత మంది మాత్రం...అవకాశం వచ్చినా తప్పు చెయ్యరు...

"మనిద్దరం ఇప్పుడు తప్పు చెయ్యొచ్చు. ఎవరికీ తెలీదు. చాలా బాగుంటుంది. ఎప్పటికీ గుర్తుంటుంది. అయినా చీకట్లో పసి పాపలా నవ మోహినిలా ఉండే నన్ను నువ్వు ఊహించు కోవాల్సిందే గాని చూడలేవు. నన్ను పొందడం కన్నా ఎక్కువ బాగుంటుంది ఆ ఊహ... పాడు చేసు కుంటావా?"

చీకట్లో మెత్తటి స్పర్శ.

అతని తలమీద చీకటే పెదవులుగా మారిన ముద్దు. చల్లగా. వెచ్చగా.

"నువ్వు...నీ... పేరు...ఏంటి?" అన్నాడు సూర్యం కలవరింతలో మేలుకుంటూ.

"ఆశ!"

ఆ తర్వాత ఆ ఇంటి నుంచి ఎప్పుడు ఎలా వచ్చేశాడో గుర్తు లేదు సూర్యానికి.

ఇది జరిగి చాలా రోజులైంది గాని ఇప్పటికీ ఏ సమ్మర్దం లోనో ఉత్సవం లోనో ప్రయాణం లోనో పెళ్ళి లోనో ఏ అదృష్టం వల్లో మెరుపు తీగ ల్లాంటి చూపులు వెంటాడితే ఉలికి పడుతుంటాడు.

అతని మనసులో చీకటి రేకులు సుతి మెత్తగా విచ్చు కుంటాయి. కోరికతో చీకటి గుప్పు మంటుంది. అందని ఆశ లాగా.

05.01.1998 సంచిక